క్లుప్తంగా

సింహవాహనంపై అగస్త్యేశ్వరుడి కటాక్షం



నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాలలో బుధవారం రాత్రి సింహవాహనంపై ఉత్సవమూర్తులు గ్రామ వీధుల్లో మేళ తాళాలు, కోలాటాల మధ్య విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం నిత్యపూజాదికాల అనంతరం 10 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగనున్నారు.

నేడు రామగిరిలో అష్టమి పూజలు



శ్రీ సంతాన కాలభైరవ క్షేత్రం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి శ్రీ సంతాన కాలభైరవ క్షేత్రంలో గురువారం అష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లత తెలిపారు. భక్తులు ఆలయం ఎదుట ఉన్న మండపంలో నేతిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకునేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు. మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇది పల్లవుల కాలం నాటి ప్రాచీన ఆలయం కావడం, ఆలయ కోనేరులో నంది విగ్రహం నోటి నుంచి జలధార ఏడాది పొడవునా వస్తుండడం విశేషం!

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనంలో మే 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గంగా ఎన్నుకుని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు దోహదపడాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులను ఒప్పించి అధిక సంఖ్యలో పూర్తి చేయాలన్నారు. అన్ని రకాల క్రిమినల్, సివిల్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

'మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరి'

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అనుమ తి లేకుండా గ్రావెల్ మట్టిని తరలిస్తే కఠిన చర్య లు తప్పవని తహసీల్దార్ టీవీసుబ్రమణ్యం బుధవారం విలేకరులకు తెలిపారు. మట్టి కావలసిన వారు భూగర్భ గనుల శాఖ ఏడీ నుంచి అనుమతి పొందాలని స్పష్టం చేశారు. తమ కార్యాలయంలో అనుమతి ఇచ్చేది లేదని, అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ కార్యాలయం వద్ద బోర్డును ఏర్పాటు చేశారు.

అందరి మద్దతు జగనన్నకే..



బొప్పరాజుపాళ్యంలో మెగా సర్వేలో పార్టీ శ్రేణులు, గృహసారథులు

నారాయణవనం: గ్రామాలలో ప్రతి గడపకు అందిన సంక్షేమ పథకాలతో లబ్దిదారులు జగనన్న పక్షాన ఉన్నారని జేసీఎస్ చైర్మన్ కోనేటి బాబు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని బొప్పరాజుపాళ్యంలో గడప గడపకు వెళ్లి మెగా సర్వే చేశారు. పంచాయతీలో వంద శాతం గృహాలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించి, అభిప్రాయాలను సేకరించి, వారి సెల్ ఫోన్ల నుంచి మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునికుమారి, పార్టీ నాయకులు రమేష్, వెంకటేష్, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని మడిబాక వద్ద బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి చెప్పారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సేవ చేశాం.. అండగా ఉండండి

- 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వనిదే పథకాలు అందేవి కావని, అదే ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సచివాలయాల వ్యవస్థతో ఎవరి సిఫార్సులు లేకుండా ఇళ్ల ముంగిటకే పథకాల ఫలాలు అర్హులందరికీ అందుతున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఎన్నో సేవలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ముచ్చివోలు సచివాలయ పరిధిలోని ఎర్రగుడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. దాదాపు 155 ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పరిపాలనలో తామంతా సంతోషంగా ఉన్నామని, మళ్లీ జగనన్నకే తాము మద్దతు ఇస్తామని ప్రజలు బాహాటంగా చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని, ఇది చూసి ఓర్చుకోలేని చంద్రబాబు, ఎల్లోమీడియా పనిగట్టుకుని ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయని, అయినా ప్రజలెవరూ నమ్మడం లేదని చెప్పారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఎస్టీ కాలనీకి రోడ్డు వేయాలని, అలాగే రామాలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కామిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వైస్ఎంపీపీ ఎ.భానుమతి యాదవ్, ఏపీ సీడ్స్‌డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ శేఖర్, లేబాక మాధవరెడ్డి, మస్తానయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటరత్నంనాయుడు, అల్లినాయుడు, మద్దిల ప్రకాష్, సుబ్బు, లేబాక రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, నాగూరయ్య, ప్రసాద్, పోలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రాజీవ్‌నగర్‌కు తీరిన దాహార్తి

- నూతన బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటుకు పూజ చేస్తున్న సర్పంచ్ వీరభద్రం

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ రాజీవ్‌నగర్‌లో గత పదేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్య స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో విముక్తి లభించింది. వివరాలు.. గత వారం రాజీవ్‌నగర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీటి సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన బోరు వేయించాలని ఎంపీపీ పద్మప్రియ, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ వీరభద్రంను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారు బోరును మంజూరు చేయించారు. బుధవారం రాజీవ్‌నగర్‌లో సర్పంచ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, బీఎస్ కండ్రిగ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సునీల్ లాంఛనంగా భూమిపూజ చేసి బోరు పనులు ప్రారంభించారు. పుష్కలంగా నీరు పడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

ఫరీద్‌బాబాకు 'అంబేడ్కర్ స్ఫూర్తి పురస్కార్'



అవార్డు అందుకున్న ఫరీద్‌బాబా

రేణిగుంట: రేణిగుంటకు చెందిన జబ్బార్ ట్రస్ట్ అధినేత షేక్ ఫరీద్‌బాబా హైదరాబాద్‌కు చెందిన శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ నుంచి ప్రతిష్టాత్మక అంబేడ్కర్ స్ఫూర్తి పురస్కార్‌ను బుధవారం అందుకున్నారు. హైదరాబాద్ అబిడ్స్ బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఫరీద్‌బాబా దంపతులు పాల్గొని అవార్డును అందుకున్నారు. ఆయన ఇటీవల కాలంలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు పేద రంగస్థల కళాకారులను సత్కరించి కానుకలు అందజేసిన నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి అవార్డును ప్రదానం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో 27 శాతం ఉత్తీర్ణత



కావ్య

ఏర్పేడు: ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల 27 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 61 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ప్రథమ సంవత్సరం 35 శాతం, ద్వితీయ సంవత్సరం 27 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు వివరించారు. సెకండియర్ విద్యార్థిని రెడ్డెప్పగారి కావ్య బైపీసీలో (రేణిగుంట మండలం నల్లపాలెం) 1000 మార్కులకుగాను 970 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. ఇక ఏర్పేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 22 మంది విద్యార్థులకుగాను నలుగురు పాసై 18 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే వ్యాసాశ్రమంలోని విద్యానందగిరి స్వామి మహిళా జూనియర్ కళాశాలలో 47 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రిన్సిపల్ చెప్పారు.

మృతుల కుటుంబాలకు 'సిపాయి భరోసా' పంపిణీ



ఏర్పేడు :కృష్ణంపల్లెలో నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట/ఏర్పేడు: రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తమ ఫౌండేషన్ ద్వారా సిపాయి భరోసా కింద 35 రకాల నిత్యావసర సరకులను అందజేశారు. రేణిగుంట మండలం కృష్ణాపురం పంచాయతీ ఎల్ఎన్ కండ్రిగలో తులసమ్మ, ఏర్పేడు మండలం పాగాలి పంచాయతీ కృష్ణంపల్లెకు చెందిన ఆరంబాకం మునిరెడ్డి (53) ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలను కలిసి ఎమ్మెల్సీ ఓదార్చారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తమ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు రమణ, బాబు, మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేంద్రబాబు, చంద్రశేఖర్, గెరటారెడ్డి, సుబ్బరాయుడు, మురగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణాలపై ఆర్డీఓ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రా మారావ్

కేవీబీపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరగతిన పూర్తి చేయయాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావ్ ఆదేశించారు. బుధవారం ఆయన మండల ంలోని పలు గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలను ఆకస్మికంగా పరిశీలించారు. యా ప్రాంతాల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. నిరుపేద కుటుంబాల ఇంటి కలను సాకారం చేసే బాధ్యతలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇకపై వారంలో రెండు రోజులు జగనన్న కాలనీల్లో వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు పర్యటించాలని, ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో పార్టీ నేత నందకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హరిబాబు, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు జాతర చాటింపు





జాతర సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణ, సదవాలమ్మ ఆలయ సమీపంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

- గంగమ్మకు అంబలి.. సదవాలమ్మకు పొంగళ్లు

సత్యవేడు: ఆరోగ్య ప్రదాయిని గంగమ్మ జాతర చాటింపు బుధవారం సత్యవేడులో నిర్వహించారు. ఉదయం నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు మహిళలు అంబలి తీసుకు వచ్చి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం సదవాలమ్మ ఆలయ సమీపంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. పాడిపంటలతో ప్రజలు సుఖంగా జీవించాలని గంగమ్మకు మొక్కులు చెల్లించారు. రాత్రి పట్టణ వీధుల్లో కలశం ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. గంగమ్మ గుడివద్ద వేపాకుతో పర్ణశాల ఏర్పాటు చేశారు. మూడు రోడ్ల కూడలి లోని టవర్ క్లాక్ వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధుల కూడళ్లలో దేవతామూర్తుల రూపాలతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. మే నెల 10, 11న సత్యవేడులో వైభవంగా జాతర నిర్వహించనున్నారు.



నడివీధి గంగమ్మ గుడివద్ద అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు

భూమి పూజకు స్థలం, స్టేజి ఏర్పాట్ల పరిశీలన



స్టేజీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి గురువారం భూమి పూజ చేయనున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం స్థానిక సంత స్థలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఆప్రాంతంలో స్టేజీ ఏర్పాట్లను ఎమ్మెల్యే బుధవారం సాయంత్రం పార్టీ శ్రేణులతో కలసి పరిశీలించారు. భూమి పూజ కార్యక్రమానికి మంత్రి కే.నారాయణస్వామి , తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి , కలెక్టర్, టీటీడీ చీఫ్ ఇంజినీర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన చెప్పారు. భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత, తాడిపత్రి నియోజవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటరత్నం, గురుప్రసాద్, రాబర్ట్, ముఖ్య నేతలు రవిరెడ్డి, గోవిందస్వామి, ఎంపీరవి, శేఖర్, రూబెన్, గోవిందస్వామి, విడి శరవణన్, బాలయ్య రెడ్డి, టి. జయ, ఎం. సుధాకర్, పూల పళణి తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజకు తరలిరండి

పిచ్చాటూరు: సత్యవేడులో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తలపెట్టిన టీటీడీ కల్యాణ మండపం భూమిపూజకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 11 గంటలకు పిచ్చాటూరు రోడ్లు భవనాల అతిథి గృహంలో, మధ్యాహ్నం 12 గంటలకు నాగలాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూమిపూజకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతారన్నారు.



పిచ్చాటూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రభుత్వంపై బురద చల్లితే సహించొద్దు

అలాగే ప్రతిపక్ష టీడీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రులను పనిగట్టుకుని విమర్శించినా, దుష్ప్రచారంతో బురద చల్లుతున్నా పార్టీ శ్రేణులు సహించరాదని, ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ, వాస్తవాలేమిటో ప్రజలకు చెప్పాలని సూచించారు. సమావేశాల్లో పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, సర్పంచ్ అన్నాదురై, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, రాజా, శోభన్, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, వైఎస్ఆర్ టీయూసీ చైర్మన్ సురేష్, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు, ఏఎంసీ డైరెక్టర్లు అలగేశన్, కులశేఖర్ రెడ్డి, షాబుద్దీన్, మోహన్, గజేంద్ర, టీజే బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

పిచ్చాటూరు ఇందిరానగర్‌కు చెందిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త బలరాం(67) అనారోగ్యంతో మరణించారు. మృతుని స్వగృహానికి వెళ్లి బలరాం భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సర్పంచ్‌కు పథకాల లబ్ధి వాస్తవమే

- నిజాయితీ ఉంటే పథకాలు తీసుకోకుండా ఉండాలి
- ఆధారాలతో వస్తాం..బహిరంగ చర్చకు సిద్ధమా?
- వలంటీర్లు, ప్రభుత్వం మీద ఆరోపణలు చేస్తే సహించం



స్థానిక టీడీపీ నేతల కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని, పథకాలను వివరిస్తున్న మాధవీరెడ్డి

కేవీబీపురం: మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీ సర్పంచ్ యర్రం దొరబాబు నాయుడు కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో రూ.1.1 లక్షల పలు ప థకాల ద్వారా లబ్ధి చేకూరడం వాస్తవమేనని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తిమ్మసముద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడంతోపాటు ఓవరాక్షన్ చేయడం, పథకాల లబ్ధి పొందినా ఏమీ లేదని టీడీపీ నేతలు బొంకడం..వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడంపై ఆమె స్పందించారు. బుధవారం తిమ్మసముద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు మాట్లాడారు. టీడీపీ నేతల తీరును తప్పుపట్టారు. ఆమె మాట్లాడుతూ, టీడీపీ సర్పంచ్ దొరబాబు భార్య వై.అనిత, అతని కుమారుడు మునిశేఖర్.. పేరిట ప్రభుత్వ పథకాలు పొందారని, అంతేకాకుండా దొరబాబు నాయుడు పేరిట ఆరోగ్యశ్రీ, పంటల బీమా పథకాలను పొంది ఉన్నట్లు ఆమె సాక్ష్యాలతో పాటు ఆయా వివరాలను చూపారు. టీడీపీ సర్పంచ్ అయినప్పటికీ అర్హతను బట్టి తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, నిజాయితీగా పథకాలను అందించామని, అయితే లబ్ధి పొందుతున్నా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇదే వ్యక్తి స్థానిక వలంటీర్లు, అధికారులపై కూడా తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. పథకాలు పొందారో.. లేదో బ్యాంక్ అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకుని టీడీపీ నేతలు బహిరంగ చర్చకు రావాలని ఆమె సవాల్ విసిరారు. కార్యక్రమంలో వలంటీర్లు, సంఘమిత్ర, స్థానిక వై ఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల ఏర్పాట్లు పరిశీలన



ఆలయ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల ఏర్పాట్లను బుధవారం ఈఓ సాగర్‌బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గురువారం ఉదయం 7 నుంచి 8గంటల లోపు భూమి పూజ చేస్తామని, పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆంజనేయ స్వామికి పాలాభిషేకం

- నేడు విమాన గోపుర కుంభాభిషేకం



ఆంజనేయ స్వామికి పాలాభిషేకం చేస్తున్న అర్చకస్వాములు

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ శ్రీ లక్ష్మీగణపతి హనుమతీశ్వరాలయ కుంభాభిషేకంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆంజనేయ స్వామికి భక్తులు పాలాభిషేకం చేశారు. అంతకు ముందు ఉదయం 9 గంటలకు రెండవ యాగశాలపూజ, హోమం, గోపుర కలశ ప్రతిష్ఠ చేశారు. సాయంత్రం వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర భజన బృందం, చెంచులక్ష్మి భజనబృందం నిర్వహించిన కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం 9 నుంచి 10.20 గంటల మధ్య విమాన గోపురం కుంభాభిషేకం, సకల దేవతలకు మహా అభిషేకం, మహా సంప్రోక్షణ నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు తెలిపారు.



మొక్కుతున్న భక్తులు